

జనగామ సబ్ జైల్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

# రేవంత్‌ది అరాచక పాలన

- ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే జర్నలిస్టుపై అక్రమ కేసు
- వెంటనే రాజ్‌కుమార్‌ను విడుదల చేయాలి
- మాజీ మంత్రి దయాకర్‌రావు డిమాండ్
- నిజాలను నిగ్గు తేల్చినందుకే అరెస్ట్
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జనగామ సబ్ జైలులో బాధితుడికి పరామర్శ

జనగామ చౌరస్తా, జనవరి 11 : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అరాచక పాలన కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిన యూట్యూబ్ జర్నలిస్టు రాజ్‌కుమార్‌ను శనివారం మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి విలేకరులతో మాట్లాడుతూ నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన రాజ్‌కుమార్ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పనిచేశారన్నారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందనే వాస్తవాన్ని, తండాల్లోని ప్రజల అభిప్రాయాలను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రసారం చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులుపెట్టి జైలుకు పంపించిందన్నారు. వెంటనే అక్రమ కేసును ఉపసంహరించుకొని అతడిని విడుదల చేయాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తన పార్టీ నాయకుల పైనే అక్రమ కేసులు పెట్టి పోలీసుల చేత కొట్టిస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో భూములు ఇవ్వమన్న లగచర్ల అమాయక గిరిజన రైతులను అరెస్ట్ చేసి జైలుకు పంపించిందన్నారు. అలాగే పాలకుర్తి నియోజకవర్గంలోని కొండాపురంకు చెందిన కాంగ్రెస్ గిరిజన నాయకుడు శ్రీనివాసుపై సొంత పార్టీ నాయకులే పీఎస్‌లో కేసు పెట్టించి పోలీసులతో కొట్టించగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు అతడు మరణ వాంగ్మూలంలో వెల్లడించినా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తొర్రూరుకు చెందిన ఓ గిరిజన యువకుడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా తండాల్లో ప్రచారం చేశాడని, పార్టీ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు అమలు కావడంలేదని సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించినందుకు అతడిపై కేసు పెట్టించి కొట్టించారన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి దుర్మార్గమైన పాలన చూడలేదన్నారు. బీఆర్‌ఎస్ నేతలపై సీఎం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. అయితే అమాయక ప్రజలను ఇబ్బందిపెట్టేలా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఎర్రబెల్లి హెచ్చరించారు.

### ప్రభుత్వాన్ని ఎండగట్టినందుకే..

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సబ్ జైల్‌లో రాజ్‌కుమార్‌ను పరామర్శించి బయటకు వస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

లగచర్ల రైతుల అక్రమ అరెస్టును, కాంగ్రెస్ ప్రభుత్వ దమన నీతిని ఎండకడుతూ తన ఛానల్‌లో ప్రసారం చేసినందుకే యూట్యూబ్ జర్నలిస్టు రాజ్‌కుమార్‌ను ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన యూట్యూబ్ ఛానల్ జర్నలిస్టు రాజ్ కుమార్‌ను సబ్ జైల్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాలను నిగ్గు తేల్చే ప్రజా గొంతుకలను జైలుకు పంపిస్తారా? అని ప్రశ్నించారు. గిరిజన జర్నలిస్టును అక్రమంగా అరెస్ట్ చేయడం సరైంది కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపులకు భయపడేది లేదని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పసుల ఏబేల్, జూకంటి శ్రీశైలం, ఉడుగుల నర్సింహులు, యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### పాలకుర్తిలో బీఆర్‌ఎస్ ధర్నా

పాలకుర్తి : యూట్యూబ్ జర్నలిస్టు రాజ్‌కుమార్ అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పసునూరి నవీన్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే ఆక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతారా? అని ప్రశ్నించారు. తక్షణమే గిరిజన యువకుడిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నారై హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి నియోజక వర్గంలోని గిరిజనులపై కక్షకట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే కేసుల మీద కాకుండా అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పాలకుర్తి పోరాటాల గడ్డ అని ఎమ్మెల్యేపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కాగా, ధర్నా సందర్భంగా కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్సై దూలం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బీఆర్‌ఎస్ శ్రేణులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో కొడకండ్ల, దేవరుప్పుల, రాయపర్తి మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు సిందె రామోజీ, తీగల దయాకర్, నునావత్ నర్సింహనాయక్, జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీనాయక్, ఓయూ జేఏసీ ప్రధాన కార్యదర్శి రాజేశ్ నాయక్, జినుగు అనిమిరెడ్డి, బొబ్బల అశోక్‌రెడ్డి, బానోత్ మహేందర్, బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, మాచర్ల ఎల్లయ్య, ఏలే సుందర్, కొత్త జలేందర్‌రెడ్డి, గండిపెల్లి యాకయ్య, పేరం రాము, కొల్లూరు సోమయ్య, కారుపోతుల వేణు, చింత రవి, మేకల సంపత్, గడ్డం రాజు, వంగ అర్జున్, కోతి ప్రవీణ్, జోగు గోపి, చెంచు రాజిరెడ్డి, దీకొండ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



పాలకుర్తి: రాజీవ్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

## పచ్చి మిర్చికి భలే డిమాండ్





పచ్చి మిర్చి అమ్మకాలు జోరందుకున్నాయి. మిర్చి సాగుచేసిన రైతులు పండు మిర్చి అందేవరకు పంట పెట్టుబడి కోసం ముందుగా చేతికొచ్చి పచ్చిమిర్చిని కూలీలతో కోయించి విక్రయిస్తున్నారు. వరంగల్, ఏటూరునాగారం, నర్సంపేట, హైదరాబాద్ నుంచి వ్యాపారులు వచ్చి పచ్చిమిర్చిని క్వింటాకు రూ.2వేలు చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెప్పారు. దీని వల్ల తమకు పెట్టుబడికి ఎంతగానో ఉపయోగంగా ఉంటున్నదని, కూలీలకు సైతం రూ.400 కూలీ వస్తున్నట్లు నాగారం గ్రామానికి చెందిన కూలీ యాలం రంగారావు తెలిపారు. -వాజేడు, జనవరి 11

- బీఆర్‌ఎస్ హయాంలోనే బ్రిడ్జికి నిధులు మంజూరు
- రెండున్నరేళ్ల నుంచి నత్తనడకన పనులు
- ఓ పక్క ఇంకా మొదలు కాని నిర్మాణం
- ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని ప్రయాణికుల ఆగ్రహం

పదుల సంఖ్యలో ఉన్న విలీన గ్రామాల ప్రజలు దర్గా కాజీపేట రైల్వే గేట్ మీదుగానే నగరానికి వెళ్లాలి. ఇక్కడ గేట్ పడిందంటే ఒక్కోసారి అర గంటకు పైగా వేచి చూడాల్సిందే. నిత్యం వాహనాలను గేట్ కింది నుంచి వంచుతూ సర్కస్ ఫీట్లు చేయడం షరామామూలే. ఒకవేళ అత్యవసరమైతే సుమారు 10 కిలోమీటర్ల చుట్టూ తిరిగి రావాల్సిందే. ఇక్కడి ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండున్నరేండ్ల క్రితం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు నత్తనడకన నడుస్తుండగా, ఓ పక్క ఇంకా మొదలే పెట్టలేదు. రైల్వే గేట్ తిప్పలు తప్పేదెప్పుడని స్థానికులు, ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. - కాజీపేట, జనవరి11



నత్తనడకన సాగుతున్న బ్రిడ్జి పనులు



దర్గా రైల్వే గేట్ పడడంతో వేచిఉన్న ప్రయాణికులు, వాహనదారులు

# తిప్పలు తప్పేదెప్పుడు..?


**దర్గా రైల్వే గేట్‌తో ప్రజలు, వాహనదారుల అవస్థలు**

### బాధలు వర్ణనాతీతం



రోజూ రైల్వే గేట్ దాటడానికి ప్రయాణికులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఓ రైలు పోతుందనుంటే మరో రైలు వస్తున్నది. గంటల తరబడి గేట్ ముందు నిలబడాల్సి వస్తున్నది. కొందరు గేటు దాటడానికి ప్రయత్నించి ప్రాణాలు పోగొట్టుకున్నారు. వెంటనే దర్గా ఫ్లై ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయాలి.

– సింగారపు బాబురావు, వాహనదారుడు, కడిపికొండ



దర్గా గేట్ పడడంతో సర్కల్ ఫీట్లు చేస్తు గేట్ కింది కెళ్లి దాటుతున్న ప్రయాణికులు

కాజీపేట రైల్వే జంక్షన్–విజయవాడ సెక్షన్‌లో ఫోర్త్ లైన్ నిర్మాణం చేయడం తో దర్గా రైల్వే గేట్ మీదుగా ప్రతిరోజు దాదాపుగా 150కి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటా యి. కొండపర్తి, అమ్మవారిపేట, భట్టుపల్లి, కొత్తపల్లి, కడిపికొండ, పవన్‌నగర్, గాంధీనగర్, ఇందిరానగర్, బుడిగ జంగాల కాలనీ, బోడగుట్ట, బియాబానీ దర్గాకు వెళ్లేవారు ఈ గేట్ మీదుగానే ప్రయాణిస్తుంటారు. గేట్ పడిందంటే ఆగాల్సిందే. ఒక్కోసారి రెండు, మూడు రైళ్లు వెళ్లిపోయే వరకు వేచి ఉండాల్సి వస్తుంది. కాజీపేట, హనుమకొండ, వరంగల్ పట్టణాలకు ఆయా విలీ న గ్రామాల ప్రజలు వెళ్లాలంటే సుమారుగా 10 కిలోమీటర్లకు పైగా దూరంగా తిరిగి వెళ్లాల్సి వ స్తోంది. స్థానిక ప్రజలు, బియాబానీ భక్తులు గేట్ మూ సి ఉంటే ద్విచక్రవాహనాలు, సైకిళ్లను గేట్ కింది నుంచి దాటి వెళ్లడానికి ప్రయత్నించి రైళ్లతో ప్రాణాలు పోగొట్టుకోవడం, ఎంతో మంది గాయాల బారిన పడిన సం దర్భాలు ఉన్నాయి. దర్గా రైల్వే గేట్ వద్ద ప్రజల ఇబ్బందులను చూసిన అప్పటి స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఫ్లై ఓవర్ రైల్వే బ్రిడ్జికి రెండున్నరేండ్ల క్రితమే శ్రీకారం చుట్టారు. మాజీ సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ. 68 కోట్లు, స్థల సేకరణకు అదనంగా రూ. 15 కోట్లు మంజూరు చేయించగా, పనులు ప్రారంభమయ్యాయి.

### నత్తనడకన పనులు..

ప్రస్తుత ప్రజాప్రతినిధులు, అధికారుల పట్టింపులేని కారణంగా దర్గా రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం జరుగుతున్నది. ఒక వైపున మాత్రమే అడపాదడపా పనులు జరుగుతుండగా, మరోవైపు ముహూర్తానికే నోచుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని, తమ బాధలు ఎప్పుడు తీరుతాయోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తమ తిప్పలు తీర్చాలని కోరుతున్నారు.

### వెంటనే పనులు చేపట్టాలి



దర్గా ఫ్లై ఓవర్ బ్రిడ్జి పను లు యుద్ధప్రాతిపాదికన చే పట్టాలి. గతంలో కంటే ఎ క్కువగా రైళ్ల రాకపోకలు ఎ క్కువ కావడంతో నిముషాల్లోనే గేట్ పడుతున్నది. దీం తో వివిధ పనులపై నగరానికి, విలీన గ్రామాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

– అంబాల రమేశ్, గాంధీనగర్, దర్గా

# పరామర్శించి.. భరోసానిచ్చి..

- ఎల్కేశ్వరం, సూరారంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి పర్యటన
- చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు బాధితులకు అండగా ఉంటామని హామీ
- భూములు లాక్కొని చేపట్టిన కెనాల్ ట్రెంచ్ పనుల పరిశీలన
- కేసీఆర్ హయాంలో సంతోషంగా ఉన్న అన్నదాతలు
- కాంగ్రెస్ అరాచక పాలనలో ఆగమవుతున్న రైతులు
- విరుచుకుపడిన శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ
- పాల్గొన్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



భూనిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న మధుసూదనాచారి, పక్కన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మహదేవపూర్, జనవరి 11 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులను శాసన మండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. శనివారం ఆయన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో కలిసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం, సూరారం గ్రామాల్లో పర్యటించారు. భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. ఎలాంటి పరిహారం చెల్లించకుండా భూములు లాక్కొని చేపట్టిన కెనాల్ ట్రెంచ్ పనులను క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించారు. ఎంత మేర భూములు కోల్పోతున్నారు? ఎంత మందికి పరిహారం అందలేదు? అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏండ్లుగా భూమినే నమ్ముకున్న తమకు అధికారులు నష్టపరిహారం చెల్లించకుండానే వందల మంది పోలీసుల పహారాలో దౌర్జన్యంగా పనులు చేస్తున్నారని, న్యాయం అడిగితే వేధింపులకు గురిచేస్తున్నారని రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. పనులు అడ్డుకున్న బాధితులను అరెస్ట్ చేశారని, రైతులపై కనికరం చూపకుండా భూముల్లోకి చొరబడ్డారని కన్నీరుమున్నీరయ్యారు. సిరికొండ మాట్లాడుతూ నష్టపరిహారం ఇవ్వకుండా పోలీసుల బందోబస్తుతో భూములు లాక్కొని చిన్న కాళేశ్వరం పనులు చేపట్టడం దారుణమన్నారు. రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా కెనాల్ పనుల కోసం పంటలను ధ్వంసం చేయమేంటని మండిపడ్డారు. ప్రాజెక్టులో కోల్పోతున్న భూములతో పాటు పంటలకు సైతం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని, కాళేశ్వరం ప్రాజెక్టులో భూములను కోల్పోయిన వారికి న్యాయం చేశామని గుర్తు చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ ముందుకు సాగారని, అన్నదాతల కళ్లల్లో ఆనందం కోసం నిరంతరం శ్రమించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనలో రైతులు ఆగమయ్యారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చిన్న కాళేశ్వరం భూనిర్వాసితులకు మెరుగైన పరిహారం చెల్లిస్తామని మ్యానిఫెస్టోలో పొందుపర్చిన కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు అధికారంలోకి రాగానే హామీలను మరిచారన్నారు. పుట్ట మధు మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం పనుల సందర్భంగా అధికారులు, కాంగ్రెస్ నాయకులు రైతులు, ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గ్రామాలకు వచ్చి సమస్యలను చూడడం లేదన్నారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పుకోవడమే తప్ప అన్నదాతలకు కాంగ్రెస్ చేసిందేమీలేదన్నారు. తమకు పరిహారం అందలేదని బాధిత రైతులు విలపిస్తున్నా మంత్రి శ్రీధర్‌బాబు పట్టించుకోవడం లేదన్నారు. బాధిత రైతులకు తగిన పరిహారం చెల్లించిన తర్వాతనే పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు బాధిత రైతుల పక్షాన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని పుట్ట మధు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, మంథని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, మాజీ సర్పంచ్‌లు ఓడేటి పద్మా రవీందర్‌రెడ్డి, నాగుల లక్ష్మారెడ్డి, టీ స్వప్నా మల్లారెడ్డి, సీనియర్ నాయకులు పెండ్యాల మనోహర్, అన్కారీ ప్రకాశ్, పోత వెంకటస్వామి, మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీంఖాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉద్యమకారులు తిరగబడితే కాంగ్రెసోళ్లు తట్టుకోలేరు!

శాయంపేట: కాంగ్రెసోళ్లు దాడులు చేస్తుంటే ఉద్యమకారులు చూస్తూ ఊరుకోరని, వాళ్లు తలచుకుంటే కాంగ్రెసోళ్లు తట్టుకోలేరని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి హెచ్చరించారు. శాయంపేటలో శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. భువనగిరి బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్‌కు అధికారమిచ్చింది ఆరు హామీలు అమలు చేయడానికేనని, కానీ, దానిని వదిలేసి దాడులు చేయడం తగదన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. రాబోయేది మళ్లీ బీఆర్‌ఎస్ సర్కారేనని చెప్పారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ఇలాంటి అరాచకాలు చేయలేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అంటేనే పక్కా ఉద్యమకారులమని, జైళ్లకు వెళ్లామన్నాని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో సార్లు తాను లాఠీ దెబ్బలు తిన్నానని కాంగ్రెస్ దాడులు తమకు లెక్కకాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు భౌతికదాడులు చేస్తే ఉద్యమకారులు తిరగబడతారని, తట్టుకోలేరని హెచ్చరించారు. తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, మా మనసులో ఉన్నది అమలు చేయాలని అనడం లేదన్నారు. ఎన్నికల్లో బాజాప్తా హామీలు ఇచ్చారని వాటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతుభరోసా విషయంలో తెలంగాణలోని ప్రతిరైతు ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. ఫార్ములా ఈ–రేస్‌లో ఎక్కడా అవినీతి లేదని తేటతెల్లమైందన్నారు. కేవలం కేటీఆర్‌ను జైలుకు పంపాలనే కుట్రతోనే రేవంత్‌రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ బాల్నే తిలక్‌బాబు కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పొడిశెట్టి గణేష్, బేరుగు రాకేశ్ పాల్గొన్నారు.

**హామీలు అమలు చేయకుండా దాడులా? : సిరికొండ**




వరంగల్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

# బస్సెప్పుడొస్తుందో..!

- సరిపడా లేక గంటల కొద్దీ నిరీక్షణ
- సీట్ల కోసం తప్పని పాట్లు
- పండుగ వేళ రద్దీగా బస్‌స్టేషన్లు

హనుమకొండ చౌరస్తా/వరంగల్ చౌరస్తా, జనవరి 11 : సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లేందుకు సరిపడా బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగ సందర్భంగా స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించడంతో శనివారం స్వగ్రామాలకు చేరుకునేందుకు వచ్చిన వారితో హనుమకొండ, వరంగల్ బస్‌స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలో 660 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ప్రజలకు ఎదురుచూపులు తప్పలేదు. గంటల తరబడి వేచిచూడాల్సి వస్తున్నదని, స్టేషన్లలో కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపిక లేక కొందరు ప్రయాణికులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా ఇదే అదునుగా వారు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు.



హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



హనుమకొండ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు